సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 27 । ఫిబ్రవరి । 2025



గంగమ్మ జాతర.. చూసొద్దాం పద

భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారమైన అనంతపురం గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. -8లో



కన్నవారిపై కత్తితో దాడి

నవ మాసాలు మోసి కని పెంచిన తల్లిదండ్రులను కత్తితో ఇష్టానుసారంగా పొడిచిన మతిస్థిమితం లేని కుమారుని ఉదంతం రాజంపేటలో వెలుగు చూసింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.120	రూ.150
రెండోరకం	రూ.80	రూ.110

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 62 మెట్రిక్ టన్నులు



భక్తి.. ప్రభవించి..

- భక్తులతో పోటెత్తిన శైవక్షేత్రాలు
- శివయ్యకు ఘనంగా పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న మల్లికార్జున స్వామి వారు



పాలతలకు వచ్చిన భక్తులతో కిటకిటలాడుతున్న క్షేత్రం



చాపాడు: ప్రత్యేక అలంకరణలో అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి



సిద్దవటం: శ్రీనిత్యపూజ స్వామిని దర్శించుకునేందుకు బారులుతీరిన భక్తులు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో నిత్యపూజస్వామి మూలవిరాట్

రాయచోటి/కడప కల్చరల్: కొండకోనల్లోని శైవ క్షేత్రాలు జనసంద్రాలయ్యాయి. శివయ్య దర్శనం కోసం భక్తులు కనుచూపు మేర బారులు తీరారు. శివరాత్రి పర్వదిన సందర్భంగా లింగమూర్తి మనసారా దర్శించుకుని తన్మయులయ్యారు. కుటుంబ సభ్యులతో కలిసి శక్తికొద్ది పూజలు చేసి తృప్తి చెందారు. జిల్లా అంతటా అటవీ ప్రాంతాల్లోని శైవ క్షేత్రాలతోపాటు ఇతర శివాలయాలలో కూడా బుధవారం శివరాత్రి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి సారించడంతో కార్యక్రమాలు సజావుగా సాగిపోయాయి. దాదాపు ప్రముఖ క్షేత్రంలోనూ శివపార్వతుల కల్యాణోత్సవాలను నిర్వహించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరై పూజలు నిర్వహించారు. మొక్కులుగల భక్తులు అన్నదానాలు, అల్పాహారం, శీతల పానీయాలను భక్తులకు అందుబాటులో ఉంచారు. జయజయశంకర..భక్త శుభంకర అంటూ శైవ క్షేత్రాలన్నీ పంచాక్షరి నామంతో ప్రతిధ్వనించాయి. దర్శనం కోసం వచ్చిన భక్తులతో బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచి శివాలయ ప్రాంగణంలో కిటకిటలాడాయి. వైఎస్సార్ జిల్లాలో శివరాత్రికి పొలతల క్షేత్రం గతం కంటే ఎక్కువ మంది భక్తులతో పోటెత్తింది. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి కుటుంబ సమేతంగా కల్యాణోత్సవంలో పాల్గొని ప్రభుత్వ పక్షాన స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. కల్యాణోత్సవంలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందజేశారు. జిల్లాలో ప్రముఖ అటవీ, శైవ క్షేత్రమైన నిత్య పూజకోనకు కూడా భక్తుల రాక గతంలో కంటే విశేషంగా పెరిగింది. ఆర్టీసీతోపాటు దేవదాయశాఖ, రెవెన్యూశాఖలు ప్రత్యేక శ్రద్ధ చూపడంతో భక్తులు సులభంగా క్షేత్రానికి చేరుకుని స్వామి దర్శనం చేసుకోగలిగారు.ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని కన్య తీర్థం, భానుకోట, అత్తిరాల, పుష్పగిరి, భైరవకోన, అగస్త్యేశ్వరాలయాలు, అల్లాడుపల్లె దేవళాలు, బ్రహ్మంగారిమఠం, శ్రీ వీరభద్రస్వామి ఆలయం తదితర ప్రముఖ శివాలయాలు, శైవ క్షేత్రాలలో శివ పూజలను వైభవోపేతంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

గజవాహనంపై భధ్రకాళీ సమేతుడు



గజవాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవారు

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ భద్రకాళీ సమేతుడు గజవాహనంపై ఊరేగారు. బుధవారం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకులు శంకర స్వామి, కృష్ణ స్వామి, శేఖర్ స్వామి, రాచరాయయోగీ స్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గజవాహనంలో కొలువుదీర్చి పట్టణ పురవీధులలో ఊరేగించారు. స్వామివారికి భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.కార్యక్రమంలో ఆలయ ఈవో డివి రమణారెడ్డి పాల్గొన్నారు.


సోమేశ్వరుని సేవలో న్యాయమూర్తులు



తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి దంపతులు

కడప కల్చరల్: దేవునికడప శ్రీ సోమేశ్వర స్వామిని శివరాత్రి సందర్భంగా బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, రామారావు దంపతులు దర్శించుకున్నారు. ఏఓ శ్రీధర్ వారికి సాదర స్వాగతం పలికి శివయ్య దర్శనం చేయించారు. అర్చకులు వేద మంత్రోక్తంగా ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలుఅందజేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు ఆలయప్రాంగణంలోని ఇతర పరివార దేవతామూర్తులను కూడా దర్శించుకుని పూజలు చేశారు.

ఏనుగుల గుంపు సంచారం



గుండాలకోనకు వెళ్లే మార్గంలోని వినాయకుడి గుడి పందిరిని ధ్వంసం చేసిన ఏనుగులు

ఓబులవారిపల్లె: అన్నమయ్య జిల్లా వైకోట గుండాలకోనకు వెళ్లే మార్గంలో మళ్లీ ఏనుగుల గుంపు మళ్లీ సంచరించింది. మంగళవారం దారి మధ్యలో ముగ్గురిని తొక్కి చంపడంతో పాటు మరో ఇద్దరిని గాయపరిచిన విషయం తెలిసిందే.బుధవారం గుండాలకోన మార్గంలో వినాయకుడి గుడి వద్ద పందిరిని ఏనుగులు ధ్వంసం చేశాయి. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

వెలుగులు నింపి.. ఆనందం పంచి



పులివెందులలో వైఎస్ రాజారెడ్డి ఐ సెంటర్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



విశేష సంఖ్యలో హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

- వైఎస్ రాజారెడ్డి కంటి వైద్యశాలను ప్రారంభించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానుల్లో ఉత్సాహం నింపిన పర్యటన
- వైఎస్ జగన్‌ను కలిసిన పలువురు నేతలు

పులివెందుల: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రెండురోజుల పులివెందుల పర్యటన ప్రజలు, కార్యకర్తల్లో ఆనందం నింపింది.తన కుటుంబానికి ఎల్లవేళలా అండగా నిలిచిన నియోజకవర్గ ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ..కంటి వెలుగులు నింపేందుకు రాజారెడ్డి ఐ సెంటర్‌ను బుధవారం ప్రారంభించి..సేవలు అందే విధంగా చర్యలు చేపట్టారు.

దశాబ్దాలుగా ఇక్కడి వారికి సేవలందిస్తున్న వైఎస్ రాజారెడ్డి ఆస్పత్రిని ఎల్వీ ప్రసాద్ ఐ సెంటర్‌కు ఇచ్చి అత్యాధునిక సదుపాయాలతో తీర్చిదిద్దారు. దాదాపు 10 కోట్లకు పైగా ఖర్చు చేసి ఆధునీకరించారు. 1974లో ప్రారంభమైన వైఎస్ రాజారెడ్డి ఆస్పత్రిలోనే దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ రూపాయి వైద్యుడిగా పేరు తెచ్చుకున్నారు. కొన్ని దశాబ్దాల క్రితం ఏదైనా ఆపద వస్తే ఇక్కడి ప్రజలు కర్నూలు, బెంగళూరు, హైదరాబాద్, తిరుపతిలకు వెళ్లి వైద్య సేవలు పొందాల్సి వచ్చేది. ఈ దుస్థితిని చూసి ఆనాడు వైఎస్ రాజారెడ్డి తన తనయుడు వైఎస్ రాజశేఖరరెడ్డితో ఇక్కడో ఆస్పత్రిని కట్టించారు. తాజాగా దాన్ని పూర్తి స్థాయిలో ఆధునీకరించారు. కీలకంగా మారిన కంటి వైద్యంలో అత్యాధునిక సేవలు కావాలని, అదీ పులివెందుల లాంటి మారుమూల ప్రాంత ప్రజలకు చేరువ కావాలని ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వైఎస్ జగన్ ఆలోచించారు. దీనిలో భాగంగా వైఎస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న రాజారెడ్డి ఐ ఆస్పత్రిని డాక్టర్ ఎల్వీ ప్రసాద్ ఐ ఆసుపత్రి వారికి ఇచ్చి అత్యాధునిక సదుపాయాలతో తీర్చిదిద్దారు. రాజారెడ్డి ఆస్పత్రి ఆశయానికి ఏ మాత్రం తీసిపోని విధంగా తాము సేవలు అందిస్తామని ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ఛైర్మన్ గుళ్లపల్లి ఎన్ రావు స్పష్టం చేస్తున్నారు. వైఎస్ రాజారెడ్డి ఐ సెంటర్‌కు ఎలాంటి అవసరాలు ఉన్నా, ఎలాంటి సదుపాయాలు కావాలన్నా వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండేషన్ తరఫున కొరత లేకుండా చూడాలని అక్కడే ఉన్న వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండేషన్ డైరెక్టర్ జనార్ధన్‌రెడ్డికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు.

- మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల రెండు రోజుల పర్యటన నియోజకవర్గంతోపాటు జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలలో కొత్త ఉత్సాహం నింపింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ శ్రేణులు, నేతలు మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసి కష్ట సుఖాలు వివరించారు. అంతేకాకుండా పార్టీ పరంగా పోరాటాలు చేస్తున్నామని కార్యకర్తలు జగన్‌కు వివరించారు. పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమంలోనూ పెద్ద ఎత్తున శ్రేణులు కదిలి వచ్చి ప్రభుత్వానికి బుద్ధి వచ్చేలా పాల్గొనాలని మాజీ సీఎం దిశానిర్దేశం చేశారు. మంగళవారం పార్టీ శ్రేణులతో మమేకమైన మాజీ సీఎం బుధవారం పులివెందులలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న సందర్భంలోనూ కార్యకర్తలతో ముచ్చటించారు.



వైఎస్ జగన్‌ను చూసిన ఆనందంలో మహిళల కేరింత..



అభిమాన నేతకు అభివాదం..



చిన్నారితో సెల్ఫీ..

ముగిసిన వైఎస్ జగన్ పర్యటన

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజలతో మమేకమయ్యారు. అలాగే పలు నూతన జంటలను ఆశీర్వదించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సింహాద్రిపురం మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తల్లి లక్ష్మీనరసమ్మ చిత్ర పటం వద్ద నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బుధవారం ఉదయం 9.30గంటల ప్రాంతంలో వైఎస్ రాజారెడ్డి ఐ సెంటర్‌కు చేరుకుని ప్రారంభించి అనంతరం అక్కడ నుంచి నేరుగా భాకరాపురంలోని హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, మాజీ ఆర్టీసీ సంస్థ ఛైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహరరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, వైస్ ఛైర్మన్ హాఫీజ్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డి, రసూల్ వీడ్కోలు పలికారు. ఉదయం 10.45గంటల ప్రాంతంలో హెలీకాప్టర్ ద్వారా బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

లంకమలకు వచ్చేస్తున్నాం!

నేడు నిష్ణాతుల అధ్యయన బృందం రాక



లంకమలలో బండపై ఆయుధాలను పోలిన రేఖా చిత్రాలు

బి.కొత్తకోట: జిల్లాలోని రాజంపేట నియోజకవర్గం సిద్దవటం అటవీరేంజిలోని లంకమల అభయారణ్యంలో మానవ జాడలపై అధ్యయనానికి నిష్ణాతుల బృందం గురువారం అడుగు పెడుతోంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే అటవీశాఖ వన్యప్రాణి విభాగం అడవిలోకి వెళ్లి అధ్యయనం చేసేందుకు అనుమతి ఇవ్వగా దీనికి సంబంధించి వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్, ఎస్పీలు తమ సహకారం అందిస్తున్నారు. ఈ బృందానికి భారతీయ పురావస్తుశాఖ డైరెక్టర్ డాక్టర్ కే.మునిరత్నంరెడ్డి నేతృత్వం వహిస్తున్నారు. బృందంలోని ఐదుగురు సభ్యుల్లో ఒక్కొక్కరు ఒక్కో విభాగంలో మంచి పట్టు కలిగిన వాళ్లు. దీంతో లంకమల అభయారణ్యంలోని వెలుగుపల్లి, జంగాలపల్లి, కొండూరు, రోళ్లబోడు, ముత్తుకూరు, సిద్దవటం, మద్దూరు అటవీప్రాంతాల్లో నాలుగు నుంచి 14వ శతాబ్దం వరకు మానవులు సాగించిన మనుగడకు సంబంధించిన శాసనాలు, లిపి, భాష, సంస్కృతం శాసనాలు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. డైరెక్టర్ మునిరత్నం శాసనాలు, అందులోని విషయాలను తర్జుమా చేసి వివరాలు వెల్లడించడంలో 20 ఏళ్ల అనుభవం కలిగి ఉన్నారు. దేశవ్యాప్తంగా, పొరుగు దేశాల్లో లభ్యమైన శాసనాలు ఎన్నింటినో అయన విశ్లేషించి నివేదికలు ఇచ్చారు. బృందంలో మరో ముఖ్యమైన వ్యక్తి చెన్నై కార్యాలయానికి చెందిన అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎం.ఏసుబాబు పురాతన మానవ అడుగుజాడలను విశ్లేషించడంలో దిట్ట. ఆది మానవులు, రాతి యుగపు ఆనవాళ్ల ఆధారంగా మానవ రహస్యలను వెలుగులోకి తీసుకొస్తారు. పురావస్తుశాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ మేకా వి.రాఘవేంద్రవర్మ సంస్కృత పండితులు. సంస్కృత భాషకు సంబంధించి వాటిని విశ్లేషించి అవి ఏ కాలంలో, ఏ శతాబ్దానికి చెందినవో చెప్పగలరు. ఫోటో ఆఫీసర్ జి.శ్రీనివాసరావు, ఎస్.శివరాజ, పి.శివకుమార్‌లు శాసనాలను కాపీ చేయడం, వాటికి సంబంధించిన విధులను నిర్వర్తిస్తారు.

రెడ్డిపల్లి నుంచి అడవిలోకి..

గురువారం ఉదయం కడపకు చేరుకునే అధ్యయన బృందం 8 గంటల తర్వాత సిద్దవటం రేంజి పరిధిలోని కొండూరు బీటు పరిధిలోని రెడ్డిపల్లి నుంచి అడవిలోకి వెళ్తారు. రేంజర్ బి.కళావతి బృందం ఎక్కడెక్కడ పరిశీలనలు జరపాలో, ఆమె వెలుగులోకి తీసుకొచ్చిన ప్రాంతాల వద్దకు తీసుకెళ్తారు. రెడ్డిపల్లి నుంచి రెండున్నర గంటల నడక తర్వాత మానవ జాడలు కొనుగొన్న చోటుకు చేరుకుంటారు. మొదట ఇక్కడి గోపాలస్వామి కొండలో లభ్యమైన ఆధారాలను పరిశీలించి శాసనాలను కాపీ చేసుకుంటారు. తర్వాత రెండో రోజు శుక్రవారం కైలాసకోన ప్రాంతానికి వెళ్లి పరిశోధనలు సాగిస్తారు.

ఇంటర్ పరీక్షలకు వేళాయె!

- మార్చి 1 నుంచి పరీక్షలు ప్రారంభం
- పోలీసుస్టేషన్‌లకు చేరుకున్న ప్రశ్నపత్రాలు
- అన్ని కేంద్రాలలో సీసీ కెమెరాల ఏర్పాటు



పరీక్షలకు సిద్ధం చేసిన టేబుల్లు

మదనపల్లె సిటీ: ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ఆయా కేంద్రాలకు ప్రశ్నప్రతాలను సమీపంలోని పోలీసుస్టేషన్‌లలో భద్రత పరిచారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు మార్చి 1వతేదీ నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 3వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలకు చెందిన మొదటి సంవత్సరం 14855 మంది, ద్వితీయ సంవత్సరం 13747 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జంబ్లింగ్ పద్ధతిలో పరీక్షలు 49 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు జరగనున్నాయి. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. కళాశాల కోడ్, చిరునామాలతో కూడిన వివరాలు ఆయా కేంద్రాల వద్ద ప్రదర్శించనున్నారు.




సులభంగా హాల్ టిక్కెట్లు: వాట్సప్, నెట్ సెంటర్ల ద్వారా సులభంగా హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇప్పటికే ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు విద్యార్థుల ఫోన్ నంబర్లకు హాల్‌టిక్కెట్లు పంపే ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఒత్తిడి లేకుండా అన్ని ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు.

పరీక్షా కేంద్రానికి ముందుగానే చేరుకోవాలి

పరీక్షకు ముందు ఆందోళన చెందొద్దు. కేంద్రానికి హడావిడిగా వెళ్లొద్దు. కనీసం అరగంట ముందే చేరుకోవాలి. అక్కడికి వెళ్లాక మిత్రులతో సంతోషంగా మాట్లాడాలి. పాఠ్యాంశానికి సంబంధించి చర్చించొద్దు. కేటాయించిన గదిలోకి వెళ్లి కూర్చొని ఇన్విజిలేటర్లు ఇచ్చిన సమాధానాల పత్రాన్ని నిశితంగా పరిశీలించాలి. బార్డర్స్ సిద్ధం చేసుకోవాలి. తప్పులు లేకుండా హాల్‌టిక్కెట్ నంబర్ రాయాలి. ప్రశ్న పత్రం ఇచ్చాక క్షుణ్ణంగా అన్నింటినీ చదవాలి. త్వరగా సమాధానాలు రాసేసినా ఒకటికి రెండు సార్లు పరిశీలించి తప్పులుంటే సరి చూసుకోవాలి.

భయపడాల్సిన అవసరం లేదు



ఇంటర్మీడియట్ విద్యార్థులు భయాందోళన చెందకుండా పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేస్తున్నాం. కాలేజీ స్థాయిలో మాదిరిగానే పబ్లిక్ పరీక్షలు కూడా ఎలాంటి ఇబ్బంది పడకుండా రాయాలి. పరీక్షలకు సన్నద్ధమతువున్న విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి.

-కృష్ణయ్య, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

క్లుప్తంగా

జగనన్న కాలనీలో చెట్లు నరికివేత

పుల్లంపేట : మండలంలోని అనంతంపల్లి పంచాయతీ జగనన్న కాలనీలో 33 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగనన్న కాలనీలో చెట్లు నరికివేశారు. ఒకవైపు ప్రభుత్వం చెట్లను నాటి పర్యావరణాన్ని కాపాడాలని చెబుతుంటే కూటమి నాయకులు వేపచెట్లను యథేచ్ఛగా నరికివేస్తున్నారని జగనన్న కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

తండ్రీ కొడుకులకు తీవ్ర గాయాలు

మదనపల్లె : తండ్రి ఆత్మహత్యా యత్నాన్ని నివారించే క్రమంలో తండ్రితో పాటు కొడుకు కూడా గాయపడిన సంఘటన బుధవారం మదనపల్లెలో జరిగింది. ఎగువకురవంకకు చెందిన లక్ష్మణప్ప(70),కు వెంకటేష్ యాదవ్ అనే కుమారుడు ఉన్నాడు. వీరికి మండలంలోని వేంపల్లె పంచాయతీ తిప్పారెడ్డిగారిపల్లె పంచాయతీ వద్ద 6.5 ఎకరాల భూమి ఉంది. ఇందులో 3.5 ఎకరాలు 1 బి కాకపోవడంతో వెంకటేష్ యాదవ్ రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. ఈ క్రమంలో కొంత మేర నగదు ఖర్చు చేశాడు. ఈ విషయమై తండ్రి లక్ష్మణప్ప కుమారుడిని నిలదీశాడు. మాటామాట పెరిగి వివాదం రేగడంతో మనస్థాపానికి గురైన లక్ష్మణప్ప తాను ఆత్మహత్య చేసుకుంటానని ఇంటిలో నుంచి వెళుతుండగా వెంకటేష్ యాదవ్ వారించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో కాలుజారి ఇద్దరు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఆటో బోల్తా

మదనపల్లె : ఆటో బోల్తాపడి ఆరుగురు గాయపడిన సంఘటన కురబలకోట మండలంలో జరిగింది. రామిగానిపల్లెకు చెందిన చరణ్‌కుమార్ (19) మదనపల్లెలో డిగ్రీ చదువుతున్నాడు. అదే విధంగా కురబలకోట మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు చైతన్య (13), వినీత్‌కుమార్ రెడ్డి (16), సంపత్(14), మదనమోహన్‌రెడ్డి (16) మహాశివరాత్రి సందర్భంగా మల్లయ్యకొండకు వెళ్లాలనుకున్నారు. రామిగానిపల్లె నుంచి ముదివేడు క్రాస్‌కు వెళ్లేందుకు వేచి చూస్తుండగా మదనపల్లె అనపగుట్టకు చెందిన హర్షవర్ధన్ (22) పాల ఆటోతో అటు వైపు వచ్చాడు. వారిని ఆటోలో ఎక్కించుకుని బయలుదేరాడు. మార్గమధ్యంలో టోల్‌ప్లాజా వద్ద ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఆరుగురు గాయపడగా బాధితులను 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంపత్, మదనమోహన్ రెడ్డిలను మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి బ్యాచ్ కోసం పోలీసుల గాలింపు

ప్రొద్దుటూరు క్రైం : ఎర్రగుంట్లకు చెందిన ఆరిఫ్‌ను చితకబాది కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించిన కేసులో నిందితుల కోసం ప్రొద్దుటూరు పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ప్రొద్దుటూరులోని పలువురు యవకులు ఆరిఫ్‌ను కంపచెట్లలోకి తీసుకెళ్లి విచక్షణా రహితంగా దాడి చేసిన విషయం తెలిసిందే. మూడు నెలల క్రితం చాపాడు మండలంలో గంజాయి కేసులో పట్టుబడిన నిందితులు ఈ దాడికి పాల్పడ్డారు. గంజాయి విక్రయిస్తున్న సమాచారాన్ని చాపాడు పోలీసులకు ఆరిఫ్ చెప్పి ఉంటాడనే అనుమానంతో గంజాయి గ్యాంగ్ దాడి, కిడ్నాప్ చేయడానికి ప్రయత్నం చేశారు. ఆరిఫ్‌ను విచారించిన అనంతరం తనపై దాడి చేసిన యువకులు ఎవరన్నది పోలీసులు ఇప్పటికే గుర్తించారు. వారి కోసం ముమ్మరంగా వేట కొనసాగిస్తున్నారు. దాడి కేసును ఛేదిస్తే గంజాయి అక్రమ రవాణా గురించి మరిన్ని విషయాలు బయటపడే అవకాశం ఉంది.

సాక్షి క్లాసిఫైడ్స్
WANTED
■Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95504 67459.
■బిస్సబిల్సీ కాదు VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పు,ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు-40వేలు, ఫ్రీరూమ్+భోజనం. Hyd.ఫోన్: 9666253675
■హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. Ph: 9640258899, 9640468899
సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409
గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్వసించి పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గంగమ్మ జాతర.. చూసొద్దాం పద

- రాయలసీమకే తలమానికం అనంతపురం గంగమ్మ దేవత జాతర
- మార్చి 1, 2 తేదీల్లో జాతర మహోత్సవం
- తరలిరానున్న లక్షలాది భక్తులు



అనంతపురం గంగమ్మ దేవత ఆలయం



అనంతపురం గంగమ్మ దేవత మూలవిరాట్

లక్కిరెడ్డిపల్లె : రాయలసీమలోనే అత్యంత ప్రసిద్ధి గాంచిన అనంతపురం గంగమ్మ జాతరను మార్చి 1, 2 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు, నిర్వాహకులు తెలిపారు. ఆర్తుల అభయప్రదాతగా విరాజిల్లుతున్న గంగమ్మ దేవత అమ్మవారిని దర్శించుకునేందుకు ఏటా లక్షలాది మంది భక్తులు తరలివస్తూ ఉంటారు. భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారమైన అనంతపురం గంగమ్మ జాతరను ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు.

ఆలయ ప్రాశస్త్యం..

గంగమ్మతల్లి అనారోగ్యానికి గురైన వారికి అభయమిస్తూ, సంతానం లేని వారికి సంతానాన్ని ప్రసాదిస్తూ భక్తుల పాలిట కల్పతరువుగా శోభిల్లుతోంది. నిత్యం విశేష పూజలందుకుంటున్న గంగమ్మ దేవత ఉమ్మడి కడప జిల్లాలోని లక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురం గ్రామంలో కొలువుదీరి ఉంది. ఏటా మహాశివరాత్రి ముగిసిన రెండవ రోజు నుంచి జాతర ప్రారంభమవుతుంది. అమ్మవారికి పుట్టినిల్లుగా భావించే కస్తూరాజుగారిపల్లె పంచాయతీలోని చాగలగుట్టపల్లె నుంచి గంగమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని అప్పలరాజుగారిల్లె, మార్లవాండ్లపల్లె, మర్రిచెట్టు, చౌటపల్లెల మీదుగా జాతర జరిగే ప్రాంతానికి ఊరేగింపుగా తీసుకొస్తారు. అనంతపురం గంగమ్మ దేవాలయానికి ఉత్సవ విగ్రహం రాగానే ఆలయం ముంగిట అమ్మవారికి బోనాలు సమర్పించి జంతుబలులను ఇస్తారు. ఇదే రోజు శిద్దల పూజ, సిడిమాను పూజలతో పాటు, రాత్రికి చాందిని, కుంకుమ బండ్లు తిప్పి భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటారు. మొదటి రోజును నిండు తిరునాలగాను, రెండవ రోజును మైల తిరునాలగాను పిలుస్తారు. ఆ రెండు రోజులు జాతరకు వచ్చే భక్తులకు మొక్కుబడులు ఉన్నవారు అన్నదానం, ఉచితంగా తాగునీటి సదుపాయాలను కల్పిస్తారు. మైల తిరునాల రోజు సాయంత్రం గంగమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని చాగలగుట్టపల్లెకు చేర్చడంతో తిరునాల పరిసమాప్తం అవుతుంది.

ఆలయ స్థల మహత్యం

అనంతపురం గ్రామంలోని ప్యారంవాండ్లపల్లెకు చెందిన ప్యారం బుడ్డారెడ్డి తన మామిడితోటకు కంచె వేసేందుకు కంప తొడుగులు కొట్టి ఎద్దుల బండ్లతో తరలిస్తుండగా ఒక కంప తొడుగును తొలగించేందుకు ఎంత ప్రయత్నించినా కదలలేదు. ఏడు గాండ్ల ఎద్దులు కట్టి ప్రయత్నించినా లాభం లేకపోయేసరికి ప్యారం బుడ్డారెడ్డి విచార వదనంతో ఆ రోజు రాత్రి ఆలోచిస్తుండగా, చెల్లు వంశానికి చెందిన యాదవ కులస్తులైన చెల్లు నాగబస్సన్న, చెల్లు గంగాల పాలకొండు అనే వారు గంగిరెద్దులాట ఆడుకొంటూ ఆ గ్రామానికి చేరుకున్నారు. వీరికి బుడ్డారెడ్డి కంపతొడుగు విషయం తెలియజేయగా వారు అక్కడ ఒక మహా శక్తి వంతమైన గంగమ్మ దేవత వెలసి ఉందని తెలిపారు. అదే రోజు రాత్రి బుడ్డారెడ్డికి కూడా గంగమ్మ దేవత కలలో కనిపించి, తనపైగల కంపతొడుగు నుంచి ఒక్కొక్క కొమ్మను తొలగించండి, నేను మీకు ప్రత్యక్షమవుతాను.. అదే స్థలంలో గుడి నిర్మాణం చేపట్టాలని తెలిపింది. అప్పుడు అదే గ్రామంలోని అనంత వరదరాయులు అనే దేవతా మూర్తి వెలసి ఉన్నారు. ఈ దేవతా మూర్తి బుడ్డారెడ్డికి కలలో కనిపించి తాను గంగమ్మ దేవత శక్తి ముందు ఎదురు నిలవలేను కనుక ఎడ్లబండి సాయంతో దిన్నెపాడు గ్రామానికి చేర్చాల్సిందిగా కోరారు. బుడ్డారెడ్డి తమ ఎద్దుల బండి సాయంతో ఆ విగ్రహాన్ని దిన్నెపాడుకు తరలించినట్లు పూర్వీకుల సమాచారం. అనంతరం ప్యారం బుడ్డారెడ్డి గంగమ్మ దేవతకు గర్భగుడిని నిర్మించగా రాయారం రెడ్లు అసంపూర్తిగా ఉన్న గుడిని నిర్మించి పూర్తిచేశారు. గుడి నిర్మాణం అనంతరం గంగమ్మ తల్లికి బుడ్డారెడ్డి పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తుండగా వారి కుటుంబ సభ్యులు కొద్ది రోజుల్లోనే అనారోగ్యం పాలయ్యారు. దీంతో విచారం వ్యక్తం చేస్తున్న బుడ్డారెడ్డికి కలలో గంగమ్మతల్లికి ప్రత్యక్షమై నా ఉనికిని తెలియజేసిన చెల్లు వంశస్తులకు పూజాది బాధ్యతలు అప్పగించమని, ప్రతి ఏడాది మాఘమాసం, శుద్ధ పాడ్యమి నాటి నుంచి ఫాల్గుణ మాసం శుద్ధ విదియ వరకు జాతర కార్యక్రమాలు నిర్వహించాల్సిందిగా తెలియజేసినట్లు చెబుతుంటారు. గంగమ్మ తల్లి ఆజ్ఞానుసారం బుడ్డారెడ్డి చెల్లు వంశస్తులను పిలిపించి బాధ్యతలను అప్పగించి అప్పటి నుంచి జాతరను అంగరంగ వైభవంగా జరిపించడం ఆనవాయితీగా మారింది. 18వ శతాబ్దం చివరి కాలంలో కడపను పరిపాలిస్తున్న నవాబులు కూడా గంగమ్మ తల్లి శక్తిని గ్రహించి నిత్యం పూజాది కార్యక్రమాలు నిర్వహించేందుకు అర్చకులకు 34 ఎకరాల భూములను మాన్యంగా కేటాయించారు.

జాతరకు వచ్చే మార్గాలు

గంగమ్మ జాతర జరిగే ప్రాంతానికి భక్తులు రోడ్డు మార్గం ద్వారా మూడు దారులలో రావచ్చు. కడప నుంచి రామాపురం ద్వారా జాతరకు చేరుకోవచ్చు. రాయచోటి- కడప జాతీయ రహదారిలో ఉన్న చిట్లూరుకు పడమర వైపు రోడ్డు నుంచి జాతరకు చేరుకోవచ్చు. లక్కిరెడ్డిపల్లె-రాయచోటి మార్గంలోని మర్రిచెట్టు నుంచి తూర్పు వైపున ఉండే రోడ్డు నుంచి జాతరకు చేరుకోవచ్చు. లక్కిరెడ్డిపల్లెలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం ఎదురుగా ఉన్న రోడ్డు నుంచి గద్దకుంట రాచపల్లె, ఈడిగపల్లె, చౌటపల్లె మార్గాల ద్వారా గంగ జాతరకు భక్తులు రావచ్చని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

తిరునాల కార్యక్రమాలు..

ఈ నెల 27 వ తేదీన గొల్లపల్లె గంగమ్మ దేవత అమ్మవారి జాగారం రోజున పూజారులు చెల్లు గంగరాజు వంశీయులు అమ్మవారికి చీర, సారెను అందించనున్నారు, 28న చాగలగుట్టపల్లెలో అమ్మవారి జాగారం రోజున పల్లు బుడ్డారెడ్డి వంశీయులైన పల్లు క్రిష్ణారెడ్డి, పల్లు రఘునాథరెడ్డిలు అమ్మవారిని ఏర్లకు తీసుకెళ్లి జంతు బలులను ఇచ్చి భక్తులకు దర్శనాన్ని కల్పిస్తారు. మార్చి 1వతేదీన శనివారం నిండు తిరునాల, అమ్మవారికి శిద్దల పూజ, చిడిమాను తిరగడం, సర్వదర్శనం, బోనాలు, చాందినీ బండ్లు ఊరేగింపు ఉంటుంది. మార్చి 2వతేదీన ఆదివారం మైలతిరునాల ఊరేగింపుతో, గంగస్నానాలతో అభిషేకంతో తిరునాల ముగుస్తుంది. తిరునాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు యనమల మదన్‌మోహన్ తెలిపారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం



గంగమ్మ జాతరకు వచ్చే భక్తులకు మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయం చుట్టూ ప్రాకార మండపంతో పాటు గాలిగోపురం, అమ్మవారి ఆలయానికి రంగులు వేశాం. ఈ ఏడాది నుంచి రూ.300 టిక్కెట్ల ద్వారా అమ్మవారి దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేశాం. సామాన్య భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం.

– శ్రీనివాసులు, ఆలయ ప్రత్యేక అధికారి

గంగమ్మతల్లి జాతరకు భారీ బందోబస్తు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణమోహన్

లక్కిరెడ్డిపల్లె : గంగమ్మతల్లి జాతరకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు. బుధవారం స్థానిక గంగమ్మ దేవత ఆలయం వద్ద సీఐ వెంకట కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 300 మంది సిబ్బందితో 24 మంది ఎస్ఐలు, ఏడుగురు సీఐలు ఈ జాతరలో బందోబస్తులో పాల్గొంటారన్నారు. క్యూలైన్, సాంస్కృతిక కార్యక్రమాలు, పార్కింగ్‌లకు ఈ బందోబస్తును విభజించామన్నారు. చాందినీ బండ్ల ఎత్తు పది అడుగులకు మించకూడదని, చాందినీ బండ్లకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని తెలిపారు. లక్షలాది మంది భక్తులు ఉంటారు కనుక బాణసంచాను నిషేధించామన్నారు. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

చేనేత కార్మికుడిపై దాడి

మదనపల్లె : చేనేత కార్మికులపై కొందరు వ్యక్తులు దాడి చేసిన సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని నీరుగట్టువారిపల్లె వెంకటేశ్వరపురానికి చెందిన వేణుగోపాల్ రెడ్డి(30), అతని స్నేహితుడు మంజునాథరెడ్డి (32)చేనేత కార్మికులుగా పని చేస్తున్నారు. మంగళవారం రాత్రి చౌడేశ్వరి ఆలయం బైపాస్ రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన కాఫీ కేఫ్ సెంటర్‌కు వెళ్లి టీ తాగి తిరిగి ద్విచక్ర వాహనంలో ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యంలో సూరి, చోటు, రాము, సతీష్‌తో పాటు మరికొందరు బైకును అడ్డుకున్నారు. ఏమని అడిగే లోపు వేణుగోపాల్‌రెడ్డిపై విచక్షణారహితంగా కర్రలు, రాడ్లతో దాడి చేశారు. స్థానికులు కేకలు వేయడంతో దాడి చేసిన వారు పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన వేణుగోపాల్‌రెడ్డిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. టూ టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

కన్నవారిపై కత్తితో దాడి





తీవ్రంగా గాయపడిన నాగమ్మ, శ్రీరాములు



నిందితుడు ప్రేమ్‌సాయి

రాజంపేట రూరల్ : నవ మాసాలు మోసి కని పెంచిన తల్లిదండ్రులను కత్తితో ఇష్టానుసారంగా పొడిచిన మతిస్థిమితం లేని కుమారుని ఉదంతం పట్టణ శివార్లలోని బలిజపల్లిలో గల పూసలకాలనీలో బుధవారం వేకువజామున వెలుగు చూసింది. బంధువులు తెలిపిన మేరకు వివరాలు.. శ్రీరాములు, నాగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ప్రేమ్‌సాయి పెయింట్ పని చేసుకుంటూ జీవనం సాగించే వాడు. శ్రీరాములు అక్క కుమార్తె రూపతో ఏడేళ్ల క్రితం ప్రేమ్‌సాయికి వివాహమైంది. వీరికి నాలుగేళ్ల విరాట్ అనే కొడుకుతో పాటు నెలల కుమారుడు ఉన్నాడు. ప్రేమ్‌సాయికి మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఏడాది నుంచి తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గత కొద్ది రోజులుగా అటు తల్లిదండ్రులతో ఇటు భార్యతో చీటికి మాటికి గొడవ పడుతుండే వాడు. అయితే 4 రోజుల నుంచి వైద్యులు ఇచ్చిన మందులు వాడటం ఆపేశాడు. ఈ నేపథ్యంలో ఇటీవల రూప తన చిన్న కుమారునితో కలిసి తన పుట్టింటికి వెళ్లింది. రూప రాలేదని తల్లిదండ్రులతో సాయి గొడవపడేవాడు. బుధవారం వేకువ జామున 2 గంటల సమయంలో ఉయ్యాలలో నిద్రిస్తున్న తన కుమారుడు విరాట్‌ను తీసుకొని వెళ్లేందుకు ప్రేమ్‌సాయి ప్రయత్నించాడు. ఇది గమనించిన తల్లిదండ్రులు విరాట్‌ను ఎక్కడికి తీసుకెళుతున్నావని ప్రేమ్‌సాయిని అడ్డగించారు. అంతే ఒక్కసారిగా అతను తన వద్ద ఉన్న కత్తితో తల్లి నాగమ్మను వీపు భాగంలో విచక్షణా రహితంగా పొడిచాడు. అడ్డుపడిన తండ్రి శ్రీరాములును సైతం పొడిచాడు. వారు గట్టిగా కేకలు వేయటంతో గ్రామస్తులు వచ్చి ప్రేమ్‌సాయిని అదుపు చేశారు. వెంటనే 108కు సమాచారం ఇచ్చి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. నిందితుడిని పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేశారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అరటి తోట దగ్ధం

పుల్లంపేట : పుల్లంపేట మండలం, జాగువారిపల్లి పంచాయతీకి చెందిన జి.సావిత్రమ్మ అనే మహిళా రైతుకు చెందిన రెండు ఎకరాల భూమిలో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అరటి తోట దగ్ధమైంది. పంట చేతికందే సమయంలో ఇలా జరగడంతో తీవ్రంగా నష్టపోయామని బాధిత మహిళా రైతు వాపోతోంది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతోంది.

ట్రాక్టర్ బోల్తా

కూలీ దుర్మరణం

నిమ్మనపల్లె : ట్రాక్టర్ బోల్తాపడి కూలీ దుర్మరణం చెందిన సంఘటన బుధవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. రాచవేటివారిపల్లె పంచాయతీ, ఎగువ మాచిరెడ్డిగారిపల్లెకు చెందిన చంద్రారెడ్డి ఇటుకల తయారీ ఫ్యాక్టరీలో ఒరిస్సాకు చెందిన పోదం (45) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం చౌడేపల్లి మండలం బోయకొండ వద్ద ఇటుకలు అన్‌లోడ్ చేసేందుకు డ్రైవర్‌తో కలిసి ట్రాక్టర్‌లో పోదం వెళ్లాడు. పని ముగించుకుని వస్తుండగా మార్గమధ్యంలో బండ్లపై గ్రామం వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో కూలీ పోదం అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. నిమ్మనపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.

సెక్యురిటీ గార్డు అదృశ్యం

కొండాపురం : మండల పరిధిలోని టి. కోడూరు గ్రామ సమీపంలోని సోలార్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న మాజీ సైనికోద్యోగి సిద్ది వెంకట క్రిష్టారెడ్డి(55) కనిపించడంలేదని తాళ్లప్రొద్దుటూరు హెడ్ కానిస్టేబుల్ యాకోబ్ తెలిపారు. ఆయన కథనం మేరకు బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో విధి నిర్వహణలో సెక్యూరిటీ సిబ్బందితో సెల్ఫీ ఫోటోలు దిగి సోలార్ సంస్థ సెక్యూరిటీ గ్రూపులో అధికారులకు షేర్ చేశాడన్నారు. ఆ తర్వాత టి. కోడూరు గ్రామ సమీపంలోని వంకలో అతని ద్విచక్రవాహనం పడి ఉందన్నారు. తెల్లవారిన తర్వాత స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి వెళ్లి పరిశీలించామన్నారు. అతని ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉందన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

భూ కబ్జాలకు అండగా కూటమి ప్రభుత్వం

మదనపల్లె : భూ కబ్జాలపై కూటమి ప్రభుత్వ పెద్దల ప్రకటనలకు, క్షేత్ర స్థాయిలో జరుగుతున్న సంఘటనలకు పొంతన లేకుండా పోయిందని, భూ కబ్జాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటోందని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఆరోపించారు. బుధవారం మదనపల్లె మండలం, బసినికొండ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1029 లో ఉన్న ప్రభుత్వ గయాళు భూమిలో అధికార పార్టీ పేరు చెప్పుకుంటూ చలపతి అనే వ్యక్తి ఆక్రమణలకు పాల్పడుతుండగా అడ్డుకున్న రెవెన్యూ అధికారులపై దాడికి యత్నించాడు. రెవెన్యూ అధికారులు తీసుకెళ్లిన జేసీబీ అద్దాలు ధ్వంసం చేయడమే కాకుండా పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దాడికి గురైన మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శేషాద్రి రావు, వీఆర్‌ఓ ప్రసాద్ లను పరామర్శించిన సీపీఎం జిల్లా కార్యదర్శి విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ అధికారులపై దాడికి పాల్పడిన చలపతిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై మదనపల్లె శాసనసభ్యులు షాజహాన్ బాషా, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని అధికారులకు అండగా ఉండాలని, భూకబ్జాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

టీడీపీ నాయకులపై హత్యాయత్నం కేసు నమోదు

రామసముద్రం : రామసముద్రంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, సీనియర్ నాయకుడు కృష్ణమూర్తిపై దాడి చేసిన ఘటనలో టీడీపీ నాయకులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మంగళవారం శ్రీ వాలీశ్వర స్వామి ఆలయ అర్చకుడు లోకనాథ దీక్షిత్‌ను ఆలయ అర్చకుడిగా తొలగిస్తూ ఉత్సవ కమిటీ నిర్ణయం తీసుకోవడంపై అర్చక సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనకు బీజేపీ నాయకులు కృష్ణమూర్తి, మండల బీజేపీ కన్వీనర్ ఆనంద్ నాయుడు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేశారని టీడీపీ నాయకులు ఆయనను దారిలో అడ్డుకుని దాడి చేశారు. తనపై టీడీపీ నాయకులు హత్యాయత్నానికి పాల్పడ్డారని కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కృష్ణమూర్తి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

అగ్ని ప్రమాదంలో రూ.లక్షకు పైగా నష్టం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని సంపతికోట ఎస్సీ కాలనీలో బుధవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో గంగంపల్లి శివన్న అనే బాధిత కుటుంబానికి రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లినట్లు వీఆర్‌ఓ నరేంద్ర తెలిపారు. ప్రమాదవశాత్తు జరిగిన ఈ అగ్ని ప్రమాదంలో ఇంట్లో ఉన్న ఫ్రిజ్‌తో పాటు వంట పాత్రలు, ధాన్యం బస్తాలు, బీరువాలోని దుస్తులన్నీ కాలిపోయాయి. బాధిత కుటుంబం కట్టు బట్టలతో వీధిన పడింది. తహసీల్దార్ శ్రీరాములు నాయక్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా బియ్యం అందజేసినట్లు వీఆర్‌ఓ తెలిపారు.



కట్టు బట్టలతో వీధినంగా చూస్తున్న బాధిత కుటుంబీకులు

ఏనుగుల దాడికి అధికారుల నిర్లక్ష్యమే కారణం



వారం రోజుల క్రితం గాదెల గ్రామ సమీపంలో అరటి తోటను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు



ఏనుగుల దాడిలో మృతి చెందిన రైల్వేకోడూరు మండలానికి చెందిన భక్తులు

ఓబులవారిపల్లె : గత పదిహేను రోజులుగా శేషాచలం అడవుల్లో దారి తప్పిన ఏనుగుల గుంపు తిరుగుతోంది. సమీపంలోని పండ్ల తోటలపై దాడులు చేస్తూ రైతులకు తీవ్రంగా నష్టం కలిగిస్తున్నాయి. ప్రస్తుతం వేసవి కాలం ముందే ప్రారంభం కావడం ఎండల తీవ్రత పెరగడంతో అడవుల్లో సంచరించే వన్యప్రాణులు తాగునీరు, ఆహారం కోసం అటవీ శివారు గ్రామాల సమీపంలోకి వస్తున్నాయి. చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా తలకోనకు వెళ్లే భక్తులపై గజరాజులు దాడి చేయడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. దశాబ్దాలుగా వై.కోట, గాదెల గ్రామాల నుంచి తలకోనకు కాలినడకన భక్తులు వెళ్లి మొక్కులు తీర్చుకునేవారు. కానీ తొలిసారిగా ఏనుగులు దాడి చేయడం ఆందోళన కలిగిస్తోంది. పదిహేను రోజులుగా ఏనుగుల మంద పిల్లలతో కలిసి దాదాపు 20, 30 ఏనుగులు అడవుల్లో సంచరిస్తున్నాయని అందరికీ తెలుసు. గ్రామస్తులను ముందస్తుగా హెచ్చించి అప్రమత్తం చేయాల్సిన అటవీ శాఖ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మూడు నిండు ప్రాణాలు బలయ్యాయని అందరూ ఆరోపిస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి

ఐదుగురికి గాయాలు



మృతి చెందిన జశ్రిత



ప్రమాదంలో నుజ్జునుజ్జుగా మారిన కారు ముందుభాగం

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని కడప–చిత్తూరు జాతీయ రహదారిపై వేపమానుసత్రం గ్రామం వద్ద బుధవారం తెల్లవారుజామున రెండు కార్లు ఢీకొనడంతో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా, ఒక చిన్నారి మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె పోలీసులు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం బాలుపల్లి గ్రామానికి చెందిన జనార్దన్‌రెడ్డి భార్యాపిల్లలతో కలిసి తన సొంత మారుతీ ఎర్టిగా కారులో రాయచోటి వైపు నుంచి వస్తుండగా కడప వైపు నుంచి హోండా సిటీ ఏపీ 21 బీఎక్స్ 1745 నెంబరుగల కారు వేగంగా వస్తూ రోడ్డుకు ఎడమవైపు వెళ్తున్న ఎర్టిగా కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎర్టిగా కారులో ప్రయాణిస్తున్న జనార్దనరెడ్డి, అతని భార్య అరుణ, కుమార్తె జశ్రిత (6) కుమారుడు శ్రేయాన్ తేజ్ రెడ్డిలకు, హోండా సిటీ కారులో ప్రయాణిస్తున్న షేక్ సద్దాం, షేక్ జహీర్‌లకు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే సమీప ప్రాంతంలోనే ఉన్న రక్షక్ వాహనంలోని పోలీసులు గాయపడిన వారిని కార్లలో నుంచి బయటకు తీసి, 108 అంబులెన్స్ కోసం ప్రయత్నించారు. సుమారు అరగంటకు పైగా రాకపోవడంతో అటుగా వెళుతున్న ప్రైవేటు వాహనాన్ని ఆపి తరలించే ప్రయత్నం చేశారు. ఈలోగా ప్రమాద తీవ్రతతో జశ్రిత ప్రమాద స్థలంలోనే మృతి చెందింది. అదే రహదారిపై వెళ్తున్న ఓ ప్రైవేట్ వైద్యుడు ప్రాథమిక వైద్య సేవలు అందించినప్పటికీ ఉపయోగం లేక జశ్రిత మృతి చెందినట్లు సమాచారం. గాయపడిన వారిని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ రోడ్డు ప్రమాదం ఘటనపై కేసు నమోదు చేసినట్లు చింతకొమ్మదిన్నె పోలీసులు తెలిపారు. కాగా హోండా సిటీ కారు ప్రమాదానికి గురైన సమయంలో స్టీరింగ్‌కు ఉన్న ఎయిర్ బ్యాగ్ తెరుచుకోకపోవడం గమనార్హం.

ఉపాధి కూలీల ఆకలి కేకలు

పెండింగ్‌లో రూ.34 కోట్ల ఉపాధి బిల్లులు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

పెద్దతిప్పసముద్రం : అన్నమయ్య జిల్లాలోని 30 మండలాల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నా బిల్లులు మాత్రం సకాలంలో అందకపోవడంతో కూలీలు సతమతమవుతున్నారు. మండుటెండలో చెమటోడ్చి చేసిన పనులకు సంబంధించి కూలి డబ్బులు రాకపోవడంతో కూలీలు పండుగ పూట కూడా పస్తులుండాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. జిల్లాలో డ్వామా అధికారుల పర్యవేక్షణలో ట్రెంచీలు, ఫారంపాండ్లు, క్యాటిల్‌పాండ్లు, క్యాటిల్ షెడ్, హౌసింగ్, పండ్ల తోటల పెంపకం, రైతుల పొలాల్లో గడ్డి పెంపకం, ప్రధానంగా సిమెంటు రోడ్ల పనులు ముమ్మరంగా జరిగాయి. అయితే గత రెండు నెలల నుంచి కూలీలకు, మెటీరియల్ పేమెంట్‌కు సంబంధించి ఎలాంటి బిల్లులు మంజూరు కాలేదు. జిల్లా వ్యాప్తంగా మెటీరియల్‌కు సంబంధించి 2,504 ఎఫ్‌టీఓలు పెండింగ్‌లో ఉన్నట్లు ఆన్‌లైన్ రికార్డులు చెబుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా కూలీలకు సంబంధించి 6 కోట్ల ,08 లక్షల, 22 వేల ,90 రూపాయలు, మెటీరియల్ పేమెంట్‌కు సంబంధించి 28 కోట్ల 19 లక్షల 18 వేల 176 రూపాయలు కలిపి మొత్తం రూ.34 కోట్ల 27 లక్షల, 40 వేల 266 రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నెలల తరబడి కూలి డబ్బులు రాకపోతే తమ లాంటి నిరుపేదలకు పూట గడిచేదెట్లా అంటూ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై డ్వామా పీడీ వెంకటరత్నంను వివరణ కోరగా జిల్లాలో రూ.30 కోట్లకు పైగా ఉపాధి బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయం వాస్తవమే అన్నారు. మార్చి మొదటి వారంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ మంజూరవుతాయని తెలిపారు.